

బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఫుట్‌పాత్‌పై వ్యాపార బోర్డులు



సత్యం జంక్షన్ - నక్కవానిపాలెం రహదారిలోని ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణాలు

పాదచారికి దారేది..?

- ఫుట్‌పాత్‌లపై కోకొల్లలుగా వెలుస్తున్న దుకాణాలు
- నడిచే వీలు లేకుండా ఆక్రమణ
- రాంగ్ పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు

సీతమ్మధార: స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో ఫుట్‌పాత్‌ల మీద ఆక్రమణల జోరు ఏమాత్రం తగ్గడం లేదు. రోడ్ల మీద ప్రమాదాలు తగ్గించడంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఫుట్‌పాత్‌లన్నీ దుకాణాల ఆక్రమణలకే అన్నట్టుగా తయారు కావడం గమనార్హం. కాలిబాటల మీద ఆక్రమణల కారణంగా పాదచారులు రోడ్ల మీదే నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవైపు నగర పోలీసులు రహదారుల మీద రాంగ్ పార్క్‌చేస్తున్న వాహనాలకు జోరుగా జరిమానాలు వడ్డించడం తెలిసిందే. అయితే ఫుట్‌పాత్‌ల మీద ఆక్రమణలను తొలగించడం మీద కూడా శ్రద్ధ వహించాలని పాదచారులు కోరుతున్నారు.

ఆక్రమణల్లో కాలిబాటలు..

జీవీఎంసీ 14, 24 వార్డుల్లోని సత్యం జంక్షన్, నక్కవానిపాలెం, అర్బన్ తహసీల్దార్ కార్యాలయం రోడ్డు, సీతమ్మధార మెయిన్ రోడ్డు, బాలయ్యశాస్త్రి లేఅవుట్ తదితర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లు పార్లర్లు, ఇతర దుకాణాల ఆక్రమణల్లో చిక్కుకున్నా యి. ఇక్కడి కాలిబాటలపై కోకొల్లలుగా చిరువ్యాపార దుకాణాలు వెలుస్తున్నాయి. వ్యాపార బోర్డులు, సామగ్రిని కూడా ఫుట్‌పాత్‌ల మీదే అడ్డంగా ఉంచడంతో పాదచారులు నడిచేందుకు దారి లేకుండా పోయింది. ఈ కారణంగా రోడ్ల మీద ట్రాఫిక్ జామ్ అవుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది.



సీతమ్మధారలో జీవీఎంసీ స్కూల్ ఎదురుగా ఉన్న రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు

రోడ్లపైనే పార్కింగ్..

ఈ వార్డుల్లోని పలు ప్రాంతాల్లో దుకాణాలకు సెల్లార్లు లేని కారణంగా రోడ్ల మీదే కార్లు, ద్విచక్ర వాహనాలను పార్క్‌చేసి ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్నారు. నిబంధనల ప్రకారం బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో సెల్లార్లు ఉండాలి. అధిక శాతం భవనాల్లో అవి ఉండటం లేదు. మరికొన్ని సెల్లార్లలోకి బయటి వాహనాలను అనుమతించడం లేదు. ఫలితంగా రోడ్లన్నీ వాహనాల పార్కింగ్ కేంద్రాలుగా మారిపోతున్నాయి. వాహనాలను వెనక్కి తీసే క్రమంలో వెనుక వైపు వాహనాలు వచ్చేటపుడు ట్రాఫిక్ జామ్ అవ్వడంతో వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. సిటీ బస్సులు తిరిగే రహదారుల మీద ఎక్కడికక్కడ వాహనాలను ఇష్టానుసారం పార్క్‌చేస్తున్నారు. ముఖ్యంగా సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ సిగ్నల్స్ వద్ద రోడ్ల మీద పార్కింగ్ కారణంగా ఫ్రీ లెఫ్ట్ మార్గంలో వాహనాలు వెళ్లలేక గ్రీన్ సిగ్నల్ పడే వరకు ఆగాల్సిన పరిస్థితి నెలకొంటుందని వాహన చోదకులు వాపోతున్నారు. పోలీసులు, జీవీఎంసీ అధికారులు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సాహిత్య గతిని మార్చిన శ్రీశ్రీ

సీతంపేట: సాహిత్య గతిని మహాకవి శ్రీశ్రీ మార్చారని పలువురు సాహితీవేత్తలు పేర్కొన్నారు. శ్రీశ్రీ 41వ వర్ధంతి సందర్భంగా విశాఖ పౌర గ్రంథాలయం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో చర్చా కార్యక్రమం జరిగింది. డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పించారు. శేఖరమంత్రి ప్రభాకర్, ఉప్పల అప్పలరాజు, పేరి రవికుమార్, కె.జి.వేణు, రాంభట్ల నృసింహశర్మ, ఆచార్య వెలమల సిమ్మన్న మొదలైన వక్తలు మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వంలో అభ్యుదయ భావజాలాన్ని, కవితా శిల్పాన్ని వివరించారు. శ్రీశ్రీ ప్రభావంతో ఎందరో యువకులు కవులాయ్యారని, సాహిత్య గతిని శ్రీశ్రీ మార్చారని పేర్కొన్నారు. శ్రీశ్రీ కవిత్వంలోని చందో వైచిత్రిని పేరి రవికుమార్ వివరించగా, శ్రీశ్రీ నాటక సాహిత్యాన్ని డాక్టర్ కె.జి.వేణు విశ్లేషించారు. రాంభట్ల నృసింహశర్మ శ్రీశ్రీ రచించిన సినీగీతాల వైశిష్ట్యం గురించి ప్రసంగించారు.



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

శ్రీశ్రీ రచనలు స్ఫూర్తిదాయకం

మురళీనగర్: మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) రచనలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. శనివారం జరిగిన మురళీనగర్ వాకర్స్ క్లబ్ కార్యవర్గం సమావేశంలో శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ పుట్టిన గడ్డగా విశాఖ పునీతమైందన్నారు. ఆయన విప్లవాత్మక రచనలు సామాజిక మార్పునకు దోహదపడ్డాయన్నారు. ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యవర్గం సమావేశంలో రానున్న నెలలో నిర్వహించాల్సిన సేవా కార్యక్రమాలపై సభ్యులు చర్చించారు. ఈ నెల 30న అపోలో హాస్పిటల్స్ నేతృత్వంలో మెగా ఉచిత వైద్య శిబిరం, జూలై 1న నిమ్మగడ్డ బుచ్చయ్యకు 91వ జన్మదినాన్ని పురస్కరించుకుని సత్కారం, 4న అల్లూరి సీతారామరాజు జయంతి, 6న సాయంత్రం 6 గంటలకు నెలవారీ సమావేశం, వాకర్స్ ఇంటర్నేషనల్ సొంత భవనం నిర్మాణానికి సభ్యత్వ నిధి ద్వారా లక్ష రూపాయలు విరాళం ఇవ్వాలని నిర్ణయించారు. శనివారం పుట్టిన రోజు జరుపుకున్న పూర్వాధ్యక్షుడు, వాకర్స్ జిల్లా 101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, కె.ద్వారకానాథ్, కె.జి.కృష్ణారావు, ఎ.భాస్కరరావు, కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి జె.కూర్మారావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, ఉపాధ్యక్షుడు ఎ.వి.సుబ్బారావు, ఎం.రామకృష్ణ, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

క్లుప్తంగా

వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సంపత్ వేంకటేశ్వరుడికి నవమి పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: జ్యేష్ఠ మాసం నవమి సందర్భంగా శనివారం గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా పూజలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ, అర్చకులు శర్మ నేతృత్వంలో వెంకన్నకు సుప్రభాత సేవ, చక్రస్నానం నిర్వహించారు. తెల్లవారుజాము 6 గంటలకు శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, కమిటీ సభ్యులు పంచామృతాభిషేకాలు, తులసీమాలార్చన, కుంకుమ పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు, నాయకులు



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

సీతమ్మధార: ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును శనివారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో పలువురు అధికారులు, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో డీసీపీలు, సీఐలు, ఎస్ఐలు, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, పలువురు ప్రభుత్వ అధికారులు, జనసేన పార్టీ నాయకులు, టీడీపీ 24వ వార్డు నాయకులు బర్ల పద్మలత, బాలకృష్ణ, వార్డు అధ్యక్షులు, బీజేపీ వార్డు అధ్యక్షులు, నాయకులు ఉన్నారు.

భారతీయ సంప్రదాయ ఔషధం ఆయుర్వేదం

బీచ్‌రోడ్డు: ఆయుర్వేదం అనేది శరీరం, మనస్సు, ఆత్మ సమతుల్యతను కాపాడుకునే లక్ష్యంతో భారతదేశంలో పుట్టిన సంప్రదాయ ఔషధమని ఆయుర్వేద వైద్యుడు గౌతమన్ కృష్ణమూర్తి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ఆయుర్వేదంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదంలోని వివిధ చికిత్సల్లో వర్మ థెరపీ ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. నియమబద్ధ జీవితం, ఆరోగ్యకరమైన ఆహారంతో మంచి ఫలితాలు వస్తాయన్నారు.

ఆర్యవైశ్య ర్యాంకర్ల సత్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: అవోపా బ్యాంక్ చాప్టర్, హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఈఏపీ సెట్, నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్-24 ఫలితాల్లో తొలి వెయ్యి ర్యాంకులు సాధించిన వారిలో 100 మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్య, వైశ్య విద్యార్థులను స్వర్ణ పతకాలతో సత్కరించనున్నట్లు చాప్టర్ సంస్థ అధ్యక్షుడు పి.వి.రమణ తెలిపారు. నగరంలోని వాకర్స్ ఇంటర్నేషనల్ నూతన భవనాన్ని శనివారం వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు, వాకర్స్ ఫౌండేషన్ ట్రస్టీ కె.రామానందంతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ఆర్య, వైశ్య విద్యార్థులు తమ దరఖాస్తులను https://forms.gle/4DRajt2L7Qr8v5NJ8 వెబ్‌సైట్ నుంచి నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. ఈ నెల 23వ తేదీలోపు వాటిని పి.వి. రమణయ్య, ప్లాట్ నంబర్ 3-81/202, విజేత విహార్ అపార్ట్‌మెంట్, చైతన్యపురి, హైదరాబాద్ చిరునామాకు పంపించాలన్నారు. వివరాలకు 94419 28528 నంబర్‌లో సంప్రదించాలని పి.వి.రమణ కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్నారి మృతి

మర్రిపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ చిన్నారి మృతి చెందిన ఘటన ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. పూజిత(10) అనే చిన్నారి తల్లిదండ్రులతో కలిసి కంచరపాలెం పోస్టాఫీస్ దరి గంగానగర్‌లో నివసిస్తోంది. శుక్రవారం రాత్రి తన తండ్రి సురేష్‌కుమార్‌తో కలిసి తాటిచెట్లపాలెం 28 బస్‌స్టాప్ నుంచి తాటిచెట్లపాలెం జాతీయ రహదారి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో రహదారి వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో అటుగా అక్కయ్యపాలెం వైపు నుంచి ఎన్ఏడీ వైపు వెళ్తున్న లారీకి ద్విచక్ర వాహనం హ్యాండిల్ తగలడంతో తండ్రీకుమార్తెలు ఇద్దరు పడిపోయారు. దీంతో పూజిత తలకు తీవ్రమైన గాయమైంది. హుటాహుటిన చిన్నారిని చికిత్స కోసం సెవెన్‌హిల్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున పూజిత మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కంచరపాలెం ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి పూజిత 4వ తరగతి చదువుతోంది.

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార: ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ ప్రసాద్ అన్నారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ద్వారకానగర్ భాష్యం స్కూల్‌లో శనివారం రహదారి భద్రతపై ద్వారకా పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఎక్కువ మంది ప్రయాణికులను తీసుకెళ్లడం సరికాదని, ఎక్కువ మంది విద్యార్థులను ఎక్కించరాదని సూచించారు. సిగ్నల్ పాయింట్ వద్ద రెడ్ లైట్ వెలిగితే రోడ్డు దాటరాదని, గ్రీన్ లైట్ వెలిగినప్పుడే వెళ్లాలన్నారు. ఆటోలకు సంబంధించిన పత్రాలు ఉండాలని, మైనర్లకు ఆటోలు ఇవ్వరాదని, మైనర్లు ఆటోలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, 18 ఏళ్లు నిండిన తరువాత లైసెన్స్ తీసుకుని వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ భాస్కరరావు, స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారు బోల్తా



కాకానినగర్ హైవేపై బోల్తా పడిన కారు

గోపాలపట్నం: కాకానినగర్ సమీప జాతీయ రహదారిపై గ్యాస్ ట్యాంకర్‌ను తప్పించబోయి ఓ కారు బోల్తా కొట్టిన ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎయిర్‌పోర్ట్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలేనికి చెందిన బత్తుల చిరంజీవి శనివారం ఇంటి వద్ద నుంచి అనకాపల్లి వైపు బయలుదేరాడు. ఎన్ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ దాటిన తరువాత కాకానినగర్ వద్ద ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను ఓవర్ టేక్ చేసే సమయంలో దాని బంపర్‌ను ఢీకొట్టడంతో అదుపుతప్పి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్న గాయాలతో చిరంజీవి బయటపడ్డాడు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బోల్తా పడిన కారును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎయిర్‌పోర్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



బిర్లా జంక్షన్ వద్ద తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు, సిబ్బంది

మర్రిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ నేతృత్వంలో సీఐ ప్రసాదరావు సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో కంచరపాలెం మెట్టు, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, హైవేలో బర్మాక్యాంప్, ఊర్వశి జంక్షన్, బిర్లా జంక్షన్ వద్ద బ్రీత్ అనలైజర్‌తో ప్రతి వాహన చోదకుడికి డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్ చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నట్టు ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు తెలిపారు. పలువురిపై కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత ర్యాష్ డ్రైవింగ్



సత్యం జంక్షన్‌లో రెడ్ సిగ్నల్ ఉండగా.. ఆగకుండా బైక్‌పై దూసుకుపోతున్న యువకులు

సీతమ్మధార: ట్రాఫిక్ రూల్స్‌ను కొందరు యువకులు పాటించడం లేదు. సిగ్నల్ జంప్‌చేస్తూ ర్యాష్‌గా బైక్‌లు నడుపుతున్నారు. హైవేపై సత్యం జంక్షన్‌లో శనివారం మధ్యాహ్నం కొందరు యువకులు రెడ్ లైట్ వెలిగి ఉండగానే.. బైక్‌పై అతి వేగంగా మద్దిలపాలెం వైపు దూసుకెళ్లారు. ట్రాఫిక్ పోలీసులు ఎన్నిసార్లు హెచ్చరించిన ఇటువంటి యువకుల తీరుమారడం లేదు. సత్యం జంక్షన్‌లో తరచూ ఇలా జరుగుతోందని, సిగ్నల్ పాయింట్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలు జరగడం కాయమని పలువురు వాహన చోదకులు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీస్ అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చురుగ్గా జోనల్ కార్యాలయం మరమ్మతు పనులు



జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతులు

సీతమ్మధార: ఆశీలమెట్ట అశోక్‌నగర్‌లోని జీవీఎంసీ జోన్-3 కార్యాలయం మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అదనపు కమిషనర్ విశ్వనాథన్ ఈ పనులను పరిశీలించి అధికారులకు సలహాలు ఇస్తున్నారు. శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, యూసీడీ, ఇంజినీరింగ్ తదితర విభాగాలలో ఆధునికీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. జోనల్ కమిషనర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. ఇక్కడున్న ఆయా విభాగాలకు రోజూ అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ముఖ్యంగా ఇక్కడున్న సౌకర్యం కేంద్రంలో ప్రజలు పన్నులు చెల్లిస్తుంటారు. త్వరలోనే ఈ పనులు పూర్తవుతాయని జోనల్ కమిషనర్ విజయలక్ష్మి తెలిపారు. రూ.50 లక్షలతో ఈ పనులు చేపట్టామన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన





నృత్యంతో అలరిస్తున్న చిన్నారి, కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందిన విద్యార్థినులు

సీతంపేట: విశాఖ సాహిత్య కళా సమితి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి నృత్యోత్సవాలు ప్రేక్షకులను అలరించాయి. శనివారం పలువురు చిన్నారులు వివిధ రీతుల్లో చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గాజువాకకు చెందిన విశాఖ సాహిత్య కళా సమితి ఆధ్వర్యంలో నాట్యగురువు టి.సందీప్ కుమార్ విద్యార్థినులకు కూచిపూడి నృత్యంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తయిన సందర్భంగా పౌర గ్రంథాలయంలో వేసవి నృత్యోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఎంత మేరకు డ్యాన్స్ నేర్చుకున్నారు తెలిసేలా ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు, కూచిపూడి కళాకారులకు నందీశ్వర, ఐరావత పురస్కారాలు ప్రదానం చేశారు.

వీనుల విందుగా సినీ సంగీత విభావరి



గాయనీ గాయకులతో అతిథులు

సీతంపేట: సాత్విక మెలోడీస్ సినీ సంగీత సంస్థ ఆధ్వర్యంలో ఆనతి నీయరా శీర్షికన శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి జరిగింది. సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీ సాత్విక వ్యాఖ్యానంలో రామనరసింహం, జ్యోతి పాడిన అదిరింది మామ అదిరిందిలే, అప్పారావు సుజాత పాడిన లేత చలిగాలిలో, సాత్విక వీరేంద్ర పాడిన ఏ రాగమో ఇది ఏ తాళమో, మెలోడీ సత్యనారాయణ జ్యోతి పాడిన ఎక్కడిది ఈవీణా, లోకేష్ సుజాత పాడిన చందమామ కన్ను కొట్టి, ఎమ్మెస్ మాధవ్ పాడిన ఆకాశ గంగ, ప్రభాకర్ పాడిన ఈ జీవన తరంగాలలో, కడలి జ్యోతి పాడిన గిలిగా గిలిగిలిగా వంటి ప్రజాదరణ పొందిన చిత్ర గీతాలతో ప్రేక్షకులను అలరించారు. ముందుగా సకల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, నటరత్న సంస్థ అధ్యక్షుడు పోతురాజు శ్రీనివాస్, ఏపీ మా కార్యదర్శి విజయరమణి కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళా సంస్థల ప్రతినిధులు గంటి మురళి, కొలతాల రాజు, సన్‌మూర్తి, వాన లక్ష్మి, వై.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు యాచకుల తరలింపు

అల్లిపురం: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, ఏయూటీడీ సిబ్బంది సంయుక్తంగా శనివారం రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి 11 మందిని షెల్టర్‌కు తరలించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. షెల్టర్‌కు తరలించిన వారిలో కొరడా అప్పలనాయుడు (వైజాగ్), ఎన్.సురేష్ (మధురవాడ), ఎల్.నాగేశ్వరరావు (అనకాపల్లి), రవీంద్ర (ఒడిశా), పాపి (ఒడిశా), కంబు (ఒడిశా), పి.నాగేశ్వరరావు (పెందుర్తి), జునియా (బీహార్), వి.పద్మ (గాజువాక), పైడమ్మ (శ్రీకాకుళం), మాలతి (ఒడిశా) ఉన్నట్లు తెలిపారు. వీరిలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో భిక్షాటన చేస్తున్న వారే అధికంగా ఉన్నారన్నారు. ఒక వ్యక్తి మాత్రం ఇంట్లో గొడవ పడి వచ్చి రైల్వే స్టేషన్‌లో ఉంటున్నాడని వీరందరినీ మందలించి, కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

నేవల్ డాక్‌యార్డ్‌లో ముగిసిన విద్యార్థుల ఇంటర్న్‌షిప్



ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న యూనివర్సిటీల విద్యార్థులతో నేవీ ఉన్నతాధికారులు



నౌకల విడిభాగాల పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న నేవీ సిబ్బంది

సింధియా: విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయం, గీతం యూనివర్సిటీ విద్యార్థులకు మే 15 నుంచి ఈ నెల 14 వరకు నిర్వహించిన ఇంటర్న్‌షిప్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారిస్తూ మెరైన్ ప్రొపల్షన్, పవర్ జనరేషన్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, యాక్సిలరీ డెక్ మెషినరీ ఆన్‌బోర్డ్ వార్‌షిప్‌లకు సంబంధించిన నిర్వహణ వంటి కార్యకలాపాలపై నాలుగు వారాల పాటు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కమాండర్ సంజయ్‌కుమార్ (హెచ్ఆర్) మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించారు. మేక్ ఇన్ ఇండియా నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ భవిష్యత్తులో నిపుణులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఇంటర్న్‌షిప్ కార్యక్రమం జరిగిందని నేవీ వర్గాలు తెలిపాయి.